# తలాక్

ఇబ్రహీంకి ఆ రోజు చాలా సంబరంగా ఉంది.

తను ఎంతటి కళాకారుడో తనవాళ్లకు చాటుకునే అవకాశం వచ్చిందతనికి. దాన్ని జారవిడుచుకోకుండా చాలా పకడ్బందీగా అన్ని సన్నాహాలు పూర్తి చేశాడు. ప్రతిపనినీ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించుకున్నాడు.

ఆ రోజు 'తలాక్' నాటకం ప్రదర్శన మొదటిరోజు. దానికి రచనా, దర్శకత్వం అతనే. అందులోని ముఖ్య భూమికని పోషిస్తుంది కూడా అతనే.

నగరంలోని ముస్లిం ప్రముఖులందరికీ ఆహ్వానాలు అందాయి. గత దశాబ్దకాలంగా ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు మెంబర్ ఖాజా మొహియుద్దీన్ గారూ, వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్, మిగతా మెంబర్లూ, సహాయమంత్రి హోదాలో ఉన్న ఫరూక్‌గారూ . . . చాలామంది వచ్చారు.

ముందు వరుసల్లో కూచున్న వాళ్లందరూ అరవైపైబడిన ముస్లిం పెద్దలే. పురప్రముఖుల్ని దగ్గరుండి తోడ్కొని వెళ్ళి ఉచిత స్థానాల్లో మర్యాదపూర్వకంగా కూచోబెడ్తున్న ఇబ్రహీంకి ఫజులుల్లా గారు వస్తూ కన్పించారు. వారి వయసు డెబ్బైపైనే ఉంటుంది. చేతికర్రని వూతంగా తీసుకుంటూ మెల్లగా నడిచి వస్తున్నారు. ఇబ్రహీంకి చిన్నప్పుడు ఉర్దూ నేర్పిన ఉస్తాద్ ఆయనే.

కృష్ణాజిల్లా వాస్తవ్యుడైన ఇబ్రహీంకి చిన్నప్పటినుంచీ తెలుగు చక్కగా అబ్బింది. ఉచ్చారణ కూడా స్పష్టంగా, స్వచ్ఛంగా ఉండేది.

"ఇబ్రహీం బేటా – థోడా ఉర్దూ, అరబ్బీ భీ సీఖో . . . మన మాతృభాషని మనం నిర్లక్ష్యం చేయకూడదు. చదవటం, రాయటం రాకపోతే ఎలా? మన పవిత్ర గ్రంథం ఖురాన్ పారాయణం చేయటం కోసమైనా నాలుగు ముక్కలు నేర్చుకోనాయనా" అనేవారు ఫజులుల్లా.

తన ఝోపడీలో ఉదయం, సాయంకాలం పిల్లల్ని పోగేసి, ఉచితంగా ఉర్దూ, అరబ్బీ నేర్పేవారాయన. ఎంత పేదరికంలో ఉన్నా, ఎవ్వరి దగ్గరా డబ్బులు తీసుకునేవారు కాదు. ఎవరైనా ఇవ్వబోయినా "అల్లా పర్‌వర్‌దిగార్ కనికరం నా మీద ఉన్నంతకాలం నాకే ఇబ్బందీ

ఉండదు. నేను పిల్లలకు చదువు నేర్పేది అల్లా సేవకోసమే. దానికి ప్రతిఫలం ఆశించటం తప్పు. ఖుదా మెచ్చడు" అనేవారు.

ఇబ్రహీం వారికి ఎదురెళ్ళి "అస్సలామలేకుం ఉస్తాద్ సాబ్" అంటూ అభివాదం చేశాడు.

వారు తలయెత్తి, అతన్ని గుర్తు పట్టడానికి ప్రయాసపడి, "బర్‌ఖుర్దార్! సలామత్ రహో" అన్నారు.

వారిని జాగ్రత్తగా నడిపించుకుని వెళ్ళి ముందు వరుసలో కూచోబెట్టాడు.

ఇబ్రహీం పదో తరగతి తప్పి, నాటక సంఘాల్లో తిరుగుతున్నాడని తెల్సినపుడు, ఫజులుల్లాగారు అతన్ని పిలిచి మందలించారు.

"బేటా! నాటకాలు కడుపునింపవు. కష్టపడి చదువుకో. ఏదో ఓ నౌకరీలో చేరు. ఆ తర్వాత బేఫికర్‌గా నీకు నచ్చిన వ్యాపకం చేసుకో. లేకపోతే దేనికీ కొరకాకుండా పోతావు" అన్నారు.

ఇబ్రహీంకి వారి మాటలేవి రుచించలేదు. మొహానికి రంగు పూసుకోవటం అతనికి వ్యసనంలా మారింది. విధవరాలైన తల్లి అతని చెవిలో ఇల్లు కట్టుకుని పోరినా ప్రయోజనం లేకపోయింది. ఆమె చనిపోయాక, అడ్డు చెప్పేవాళ్ళు లేక దొరికిన స్వేచ్ఛని సద్వినియోగం చేసుకున్నాడు. ఉన్న వూరు వదిలేసి నాటకాలంటూ వూళ్ళు పట్టుకుని తిరిగేవాడు. అలా తిరుగుతున్నప్పుడే జమీలున్నిసాతో నిఖా జరిగింది.

"దేశదిమ్మరిలా తిరిగే నీకు పిల్లనెవరిస్తార్రా" అని గేలి చేసేవారు అతని వూరి జనాలు. 'కానీకి ఠికాణా లేదు. మొహానికి రంగు పులుముకుని బలాదూర్‌గా బతికే నిన్ను నమ్మి, ఆడపిల్లని నీ చేతిలో పెట్టి గొంతు కోయడానికి ఏ తండ్రీ ఇష్టపడడు' అని ఎద్దేవా చేసేవారు అతని బంధువులు. అలాంటి ఇబ్రహీంకి జమీలున్నిసాలాంటి ముగ్ధ బేగంసాహెబా కావటం అల్లా లీల కాకపోతే మరేమిటి?

ఆ రోజు తెనాలిలో నాటకం వేస్తున్నారు. ఇబ్రహీంకి విడిది ఫరీద్‌గారింట్లో ఏర్పాటు చేశారు. ఫరీద్‌కి ఆ వూర్లో పాత ఇనుపసామానుల షాపుంది. అతనికున్న ఏడుగురు సంతానంలో జమీలున్నిసా చివరిది.

నాటకం బాగా రక్తికట్టింది. ఇబ్రహీం స్వతహాగా స్ఫురద్రూపి. దానికితోడు చక్కటి అభినయం – వాక్పటిమ – ఖంగుమనే కంఠం . . . ప్రేక్షకులందర్నీ అతని నటన ఆకట్టుకుంది– ఫరీద్‌ని కూడా.

అతని రూపంతో పాటు అతని మృదువర్తన – పెద్దలంటే అతనికున్న గౌరవం – నిష్ఠగా ఐదుపూటలా నమాజు – ఆరోగ్యకరమైన అలవాట్లు . . . అన్నీ ఫరీద్‌కి నచ్చాయి. అందుకే

అతను తెనాలి వదిలి వెళ్ళేముందు పెళ్ళి ప్రస్తావన తీసుకు వచ్చారు. మరో నెలకి ఇబ్రహీంకి జమీలున్నిసాతో నిఖా జరిగింది.

గ్రీన్‌రూంలో మొహానికి పెట్టుడు గడ్డం అతికించుకుంటూ – పక్కనే బుగ్గలపై గులాబీరంగు అద్దుకుంటున్న జమీలున్నిసాని చూసి చిన్నగా నవ్వుకున్నాడు ఇబ్రహీం.

నాజూగ్గా బంగారుతీగలా . . . కలువరేకుల్లా మురిపించే విశాలమైన కనుదోయితో . . . గులాబి రేకుల్లాంటి పల్చటి పెదాల్తో . . . స్నిగ్ధ సౌందర్యంతో . . . జన్నత్‌కీ పరీలా ఉండే జమీలున్నిసాని వదిలి నాటకాల కోసం వేరే వూళ్ళు వెళ్ళాల్సి వచ్చినప్పుడు ప్రాణం విలవిల్లాడిపోయేది ఇబ్రహీంకి. నాటకాలు మానేద్దామనుకున్నాడు. మనసొప్పింది కాదు. అలాగని అందమైన భార్యని వదిలి వెళ్ళటమూ ఇష్టముండేది కాదు. అతనికి నాటకం ఎంత ప్రాణమో జమీలున్నిసా కూడా అంతే ప్రాణం. ఈ రెండిట్లో ఒకదాన్నే కోరుకుని, మరోదాన్ని వదిలేయటం మరణంతో సమానం.

చాన్నాళ్ళు ఈ రెండింటి మధ్య నలిగీ నలిగి చివరికి ఓ నిర్ణయానికొచ్చి జమీలున్నిసాని కదిపిచూసాడు. మొదట కస్సుమంది. బుజ్జగించి, బ్రతిమాలి చివరికెలాగయితేనేం ఒప్పించ గలిగాడు. పరిషత్ నాటకాలప్పుడు రోజుల తరబడి ఒంటరిగా ఉండాల్సి రావటం దుస్సహంగా ఉన్న జమీలున్నిసా అయిష్టంగా ఉన్నా, అంగీకారం తెలిపింది. ఆ విధంగా ఆమె కూడా నాటకాల్లో చిన్న చిన్న వేషాలు వేస్తూ ఇబ్రహీంతో పాటే ఉండసాగింది.

ఈ రోజు మొట్టమొదటిసారి ముస్లిం జీవితాన్ని కథా వస్తువుగా తీసుకుని రాసిన నాటకం వేయబోతున్నారు. దీనికి అంకురార్పణ రాజమండ్రిలో పరిషత్ నాటకాల పోటీలప్పుడు జరిగింది. ఆ పోటీల్లో ఇబ్రహీంకి ఉత్తమ నటుడిగా బహుమతి వచ్చింది. బహుమతి ప్రదానానికి విచ్చేసిన కలెక్టర్ రెహమాన్ గారు సభా కార్యక్రమాలు ముగిశాక ఇబ్రహీంని పక్కకు పిలిచి వ్యక్తిగతంగా అభినందనలు తెలిపారు.

"ఈ పోటీలో దాదాపు ఇరవై నాటకాలు ప్రదర్శించబడ్డాయి. అన్నీ హిందూ జీవితాల చుట్టూ తిరిగేవే. మన ముస్లిం సాంప్రదాయాల గురించీ, జీవిత విధానం గురించీ, మనవాళ్ళు ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన సాంఘిక సమస్యల గురించీ నాటకాలు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది" కాదంటావా అన్నట్టు ఇబ్రహీం వైపు చూశారాయన.

"అలాంటి నాటకాలు ఎవరైనా రాస్తే వేయడానికి నేను సిద్ధమే" అన్నాడు ఇబ్రహీం. "ఎవరో రాయాలని మనం ఎదురుచూస్తూ కూచోవటం తప్పు. ఆ పని మనమే ఎందుకు చేయకూడదు? మీరే పూనుకోండి. ముస్లిం జీవితాల గురించి ముస్లింలకు తెల్సినంత క్షుణ్ణంగా – వివరంగా

వేరే వాళ్ళకు తెలిసే అవకాశం లేదు" అన్నారాయన.

ఆ మాటల్ని స్ఫూర్తిగా తీసుకుని కథను తనే తయారు చేసుకుని, డైలాగులు రాసుకుని, స్వయంగా దర్శకత్వం కూడా వహిస్తున్నాడు ఇబ్రహీం.

తనకు నిఖా జరిపించిన ఖాజీ షాబుద్దీన్‌గారు వస్తున్నారని విని గ్రీన్‌రూంలోంచి బైటికొచ్చి వారికెదురెళ్ళి స్వాగతం పలికాడు.

"అదాబ్ అర్జ్‌హై ఖాజీ సాబ్"

"జీతే రహో బేటా" ఇబ్రహీం పెట్టుడు గడ్డంవైపు అదోలా చూస్తూ అన్నాడతను. ఇబ్రహీంకి అనుమానం వచ్చి తన గడ్డాన్ని మెల్లగా తడుముకుని చూసుకున్నాడు. వూడిపోలేదు. అతుక్కునే ఉంది. చిన్నగా నవ్వుకున్నాడు. నిఖా అప్పుడు ఖాజీగారు "ఆజ్‌కల్‌కె ఛోకరే దాడీ పాలనా గునాః సమఝుతేహై" అంటూ ముస్లిం యువకులు గడ్డాలు పెంచుకోడానికి విముఖంగా ఉంటున్నారని తెగ బాధ పడిపోవటం గుర్తొచ్చింది.

ఖాజీగార్ని నాటకానికి రప్పించడం ఇబ్రహీంకి చాలా కష్టమైంది. వారిని నాటకానికి ఆహ్వానించడానికి వెళ్ళినపుడు "దేఖో బేటా ! ఈ నాటకాలూ, సినిమాలూ మన ఇస్లాం సాంప్రదాయాలకు విరుద్ధం. నేనురాను. అసలు నువ్వు ఇవన్నీ మానేస్తే సంతోషపడ్తాను" అన్నారు. చాలాసేపు బ్రతిమాలాక, కథ ముస్లిం జీవితానికి సంబంధించింది కాబట్టి వారి అమూల్యమైన అభిప్రాయం అవసరమని నచ్చచెప్పాక, అందరి బలవంతం మీద అయిష్టంగానే ఒప్పుకున్నారు.

ఖాజీగార్ని ఫజులుల్లాగారి పక్కన కూచోబెట్టి గ్రీన్‌రూంలోకి వెళ్ళిపోయాడు. నాటకం మొదలయ్యింది. మామూలు మధ్యతరగతి సంసార కథ. కథానాయకుడు హమీద్. అతని భార్య అక్తరున్నిసా. వారికిద్దరు పిల్లలు. అన్యోన్య దాంపత్యం. హమీద్ మజ్దూర్‌గా దుబాయ్ వెళ్తాడు. తిరిగి వచ్చినపుడు భార్యమీద అనుమానపడ్తాడు. తనకు లొంగలేదన్న కోపంతో పక్కింటి మజహర్ రాసిన ఉత్తరం ఆధారంగా ఆమెకు అక్రమ సంబంధం అంటగట్టి, ఆవేశంలో మూడుసార్లు తలాక్ చెప్పేస్తాడు. ఆమెను వదిలి మరో పెళ్ళి చేసుకుని దుబాయ్ తిరిగి వెళ్ళిపోతాడు. అభంశుభం తెలీని అక్తరున్నిసా తన ఇద్దరు పిల్లల్తో ఎన్ని కష్టాలు పడిందో కంట తడిపెట్టించేలా చెప్తుంది నాటకం.

హమీద్ పాత్రని ఇబ్రహీం పోషిస్తున్నాడు. అక్తరున్నిసాగా జమీలున్నిసా అద్భుతంగా నటిస్తోంది.

నాటకం రసరమ్యంగా సాగుతోంది. ప్రేక్షకులు మైమరచి చూస్తున్నారు. హమీద్ తన

భార్యకు విడాకులిచ్చే సీన్ వచ్చింది. ఆ పాత్రలో పూర్తిగా లీనమైపోయిన ఇబ్రహీం జమీలున్నిసా వైపు తీక్షణంగా చూస్తూ, "నువ్వంటే నాకసహ్యం. ఇక నువ్వూ నేను కలిసి ఉండటం కల్ల. ఈ క్షణమే నీకు విడాకులిస్తున్నాను. తలాక్ తలాక్ తలాక్" అన్నాడు. జమీలున్నిసా అనంతమైన బాధని మొహంలో చూపిస్తూ, 'యా ఖుదా' అంటూ కుప్పకూలిపోయింది.

నాటకాన్ని అయిష్టంగా చూస్తున్న షాబుద్దీన్ ఆ మాటలకు ఉలిక్కిపడ్డాడు. తన కళ్ళముందు ఏం జరుగుతోంది? తన చెవులు ఏం విన్నాయి? తను నిఖా జరిపిన ఇబ్రహీం కొన్ని వందల సాక్షుల ఎదురుగా తన భార్య జమీలున్నిసాకు తలాక్ మూడుసార్లు చెప్పాడు. అయినా ఇదంతా నాటకంలో భాగం కదా అన్పించిందో క్షణం. మరుక్షణం అది సరికాదనిపించింది. ఇంత మంది కళ్ళెదురుగా జరిగింది నిజం కాకుండా ఎలా ఉంటుంది? ఇంతమంది విన్న మాట ఉత్తుత్తిదని ఎలా కొట్టేయడానికి వీలవుతుంది?

ముస్లిం మతాచారం ప్రకారం భర్త నోటినుంచి మూడుసార్లు తలాక్ అనే పదం భార్యనుద్దేశించి ఉచ్చరించబడితే విడాకులు ఇచ్చేసినట్లే.

అతని మనసులో అలజడి . . . నాటకంలో హమీద్ అనే పాత్ర తన భార్య పాత్ర అయిన అక్తరున్నిసాకు విడాకులిచ్చింది - అంతేగానీ ఇబ్రహీం తన భార్య జమీలున్నిసాకు విడాకులివ్వలేదు. మరెందుకు తన మనసు ఆందోళనకు గురౌతోంది?

అతను అస్థిమితంగా కుర్చీలో అటూ ఇటూ కదిలాడు.

తన పక్కన కూచుని ఉన్న ఎం.పీ. గారి వైపు చూశాడు. అతను ఆసక్తిగా నాటకం చూస్తున్నాడు. తనకు మరో పక్క కూచుని ఉన్న ఫజులుల్లా గారివైపు చూశాడు. వారు ఏదో విషయం గురించి దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు తన పొడవాటి గడ్డాన్ని నిమురుకుంటూ దిక్కులు చూస్తున్నారు.

"జనాబ్! కొద్దిగా బైటికెళ్దాం వస్తారా" అతన్ని ఉద్దేశించి అన్నారు షాబుద్దీన్‌గారు. ఫజులుల్లా ఏమనుకున్నారో ఏమో "జీ! పదండి" అంటూ లేచారు. ఆ ఇద్దరు ముసలివాళ్ళు ఒకర్నొకరు ఆసరాగా పట్టుకుంటూ, మెల్లగా నడిచి బైటికొచ్చారు.

అక్కడ వేపచెట్టుకింద కట్టిన చప్టామీద కూచున్నారు. కొద్దిసేపు ఎవ్వరూ ఏదీ మాట్లాడుకోలేదు. ఏదో అనర్థం జరిగిపోయిందన్న భావం ఇద్దరి మొహాల్లో స్పష్టంగా కన్పిస్తోంది. మొదట షాబుద్దీన్‌గారే విషయాన్ని కదిపారు, "జరిగిన దాని గురించి మీరేమను కుంటున్నారూ?"

ఫజులుల్లాగారికి విషయం అర్థమైనా తనకు తానుగా ఎందుకు బయటపడాలని "దేని గురించి?" నొసలు ముడుస్తూ అడిగారు.

"ఈ నాటకం గురించి"

"దానికేం? అవ్వల్ క్లాసుగా ఉంది. ఇబ్రహీం బేటా నటన బావుంది. కహానీ బఢియా - బహుత్ అచ్ఛాహై".

"ఆ విషయం సరే - నేనడిగింది తలాక్ గురించి".

"తలాక్ గురించి నేను మీకు చెప్పగలవాడినా? మీరు ఖాజీలు" దాటవేయడానికి ప్రయత్నించాడు.

"ఇందాక నాటకంలో ఇబ్రహీం తన భార్య జమీలున్నిసాతో మూడుసార్లు తలాక్ అన్నాడు కదా - మీ అభిప్రాయం ఏమిటి?"

"నాటకంలో కదా".

"కానీ వారిద్దరూ భార్యాభర్తలు. మన ఇస్లాం ప్రకారం భార్యతో భర్త మూడుసార్లు తలాక్ చెబితే వాళ్ళిద్దరూ ఆ క్షణం నుంచీ భార్యాభర్తలు కాదు. విడిపోయినట్లే"

ఫజులుల్లాని అరగంట నుండీ తినేస్తున్న సమస్య అదే. కాదని ఎట్లా అనగలడు? అయినా ఇబ్రహీం మీద ఉండే అభిమానం కొద్దీ కొంత, తన మనసుకు తను సమాధానం చెప్పుకునే ధోరణిలో కొంత ఇలా అన్నాడు. "అనంత కరుణామయుడూ, అపార కృపాశీలుడు అయిన అల్లాకు తెలియదా - ఇబ్రహీంకి తన భార్యతో విడిపోయే ఉద్దేశం ఏదీ లేదని - నాటకంలోని ఓ పాత్ర మరో పాత్రతో . . ."

"ఆ మరోపాత్ర మరెవరో అయి ఉంటే అసలు సమస్యే ఉండకపోను. ఆమె అతనికి భార్య. నిఖా జరిపింది నేను. నా సమక్షంలో . . . మనందరి సమక్షంలో . . . ఇంతమంది సాక్షుల మధ్య తలాక్ మూడుసార్లు చెప్పాక . . . ఆ నిఖా ఇంకా ఉన్నట్లా లేక విడాకులు ఇచ్చేసినట్లా? మీరు బుజుర్గ్ . . . బాగా చదువుకున్నవారు . . . మీరే చెప్పండి."

ఫజులుల్లాకు పచ్చి వెలక్కాయ నోట్లో పడ్డట్టయింది. కొద్దిసేపు నీళ్ళు నమిలి, ఎలాగోలా గొంతు పెగుల్చుకుని చెప్పారు. "మీరు చెప్పిందే సహీ అన్పిస్తోంది ఖాజీ సాబ్".

"ఇప్పుడు మనమేం చేయాలి?"

తన శిష్యుణ్ణి రక్షించుకోటం కన్నా మతమే ముఖ్యమని నిర్ధారణకు వచ్చిన ఫజులుల్లా గారు "ఆప్‌హీ ఫర్మాయియే" అన్నారు.

"ఆడిటోరియంలో ఎంతోమంది పెద్దలున్నారు. వారి ఉద్దేశం కూడా కనుక్కుని తుది

నిర్ణయానికి రావటం మంచిదేమో".

"ఠీక్ కహా! మీరిక్కడే కూచుని ఉండండి ఉస్తాద్ సాబ్. నేను మిగతా వారిని పిల్చుకు వస్తాను" అంటూ షాబుద్దీన్ గారు మెల్లగా నడుచుకుంటూ ఆడిటోరియం లోపలికి వెళ్ళారు. ముగ్గురు ముసల్మానుల్తో గుసగుసలుగా మాట్లాడివారిని బైటికి పిల్చుకు వచ్చారు. వాళ్ళు విషయం విని "హా - మైభీ వైసాచ్ సోచా" అంటూ మిగతా వాళ్ళను పిల్చుకు రావడానికి లోపలికి వెళ్ళారు.

ఓ అరగంట వ్యవధిలో మంత్రి ఫరూక్‌గారు, యం.పి. ఖాజా మొహియుద్దీన్‌గారు తప్ప మిగతా ముస్లిం పెద్దలందరూ వేపచెట్టు కింద ఆసీనులై - జరిగిన విషయం గురించి వాదోపవాదాల్లో పడిపోయారు.

నాటకం వేస్తున్న ఇబ్రహీంకి విషయం ఏమిటో అర్థం కాక పిచ్చెక్కుతున్నట్లుంది. తను ఎన్నో నాటకాలు వేశాడు. తన హావభావ ప్రకటనల్ని, తను డైలాగులు పలికే విధానాన్ని మెచ్చుకుని ఈలలు వేసి వన్స్‌మోర్ అన్నవారే తప్ప ఇలా నాటకం మధ్యలో సగానికి పైగా జనం లేచి వెళ్ళిపోవటం ఎప్పుడూ జరగలేదు. అతనికి చాలా అవమానంగా అన్పించింది. దుఃఖం ముంచుకొచ్చింది.

డైలాగులు చెప్తూనే మిగిలి ఉన్న ప్రేక్షకులవైపు పరిశీలనగా చూశాడు. ఒకరిద్దరు తప్ప గడ్డాలు పెంచుకున్నవారు ఆడిటోరియంలో కన్పించలేదు. అంటే ముస్లిం పెద్దలందరూ లేచి వెళ్ళిపోయారన్నమాట . . . తనేమైనా నాటకాన్ని తప్పుగా రాశాడా? డైలాగుల్లో ముస్లింలను కించపర్చే వాక్యాలేమైనా దొర్లాయా? 'యా అల్లా! ఇదేం ఉపద్రవం!' అనుకున్నాడు.

తను కూడా ముస్లిమే కదా. కాఫిర్ కాదుగా . . . అల్లాకు విధేయుడు. రోజూ నిష్ఠగా ఐదుపూట్లా నమాజ్ చదువుతాడు. అలాంటిది తను తన మతాన్ని కించపర్చే విధంగా ఎందుకు రాస్తాడు?

అతనికి సాల్మన్ రష్దీ గుర్తొచ్చాడు. లజ్జ నవల రాసిన తస్లీమా నస్రీన్ గుర్తొచ్చింది. వాళ్ళమీద ముస్లిం మతవాదులు జారీ చేసిన ఫత్వా గుర్తొచ్చింది.

'పర్‌వర్‌దిగార్! నేనేమైనా తప్పుగా రాశానా? నా వాళ్ళు నా మీద ఫత్వా జారీ చేస్తారా? నన్ను మతంలోంచి బహిష్కరిస్తారా? యా ఖుదా! మొట్టమొదటిసారిగా ముస్లిం జీవితాల గురించి నాటకం రాసి నా వాళ్ళకేదో మేలు చేస్తున్నానని అపోహపడ్డానే! అనాలోచితంగా ఏ కీడు చేశానో? చివరికిది ఎలా పరిణమిస్తుందో?'

అతని ఆలోచనలు రకరకాలుగా పోతున్నాయి. సగం ఖాళీ అయిన ఆడిటోరియం

తెరుచుకున్న పులి నోరులా భయపెడుతోంది. ఆ మానసిక వ్యథతో కొన్ని డైలాగులు మర్చిపోయాడు. ఎలాగోలా నాటకం అయిందనిపించాడు.

ముస్లిం పెద్దల విన్నపంతో మంత్రిగారూ, యం.పి.గారూ ఉండిపోయారు. మిగతా ప్రేక్షకులు వెళ్ళిపోయాక ముస్లింలందరూ ఆడిటోరియంలో సమావేశమైనారు.

విషయమేమిటో అర్థం కాకున్నా - అది గంభీరమైన విషయమేనని అర్థమై - వూపిరి బిగపట్టి విషణ్ణ వదనంతో నిలబడ్డాడు ఇబ్రహీం. ఏం జరుగుతుందో అర్థంకాని జమీలున్నిసా చాటుగా గ్రీన్‌రూంలో బితుకుబితుకుమంటూ కూచుంది.

ముందుగా షాబుద్దీన్‌గారు స్టేజీ ఎక్కి గొంతు సవరించుకున్నారు. "సబ్ లోగోంకో ఆదాబ్! ఇబ్రహీంకి నిఖా జరిపించిన ఖాజీని నేను. నా పేరు షాబుద్దీన్. ఇక్కడ మన కళ్ళెదుట ఓ ఘోరం జరిగిపోయింది. నాటకం చూసి, బర్‌ఖుర్దార్ ఇబ్రహీంని దీవించి వెళ్ళటానికి వచ్చిన మనందరికి అనుకోకుండా ఓ అజీబ్ పరిస్థితి ఎదురైంది. ఇబ్రహీంమియా తన భార్య జమీలున్నిసా బేగంతో మూడుసార్లు తలాక్ చెప్పటం వల్ల విడాకులిచ్చేసినట్లే. ఇకముందు వాళ్ళిద్దరూ భార్యాభర్తలుగా కలిసి ఉండటానికి మతం ఒప్పుకోదు. ఇది నాటకమే కదా- అందులోని పాత్రలే కదా ఆ మాటలు పలికింది అని కొందరు వితండవాదులు వాదించవచ్చు. వాళ్ళందరూ కాఫిర్లు. మత నియమాల గురించి సరియైన అవగాహన లేనివారు. మన షరియత్‌లో ఇలాంటి సర్దుబాట్లు ఏవీ లేవు. ఒకసారి భర్త తన భార్యతో మూడుసార్లు తలాక్ చెప్పాక మరలా వెనక్కి తీసుకునే వెసులుబాటులేదు. వింటిని వదిలిన బాణాలు ఎలానో ఇదీ అలానే. ఏ సందర్భంలో అన్నాడూ ఏ పరిస్థితిలో అన్నాడూ అనేది ముఖ్యం కాదు. కాబట్టి ఈ క్షణం నుంచీ ఇబ్రహీం, జమీలున్నిసా భార్యాభర్తలు కాదని ఈ జమాయత్‌లో నిర్ణయించడమైంది."

వింటున్న ఇబ్రహీం ఇందాక నాటకంలో తన భర్త తనకు విడాకులిచ్చినపుడు అక్తరున్నిసా 'యా ఖుదా' అంటూ కుప్పకూలినట్లు 'యా అల్లా' అంటూ దబ్బున కూలబడిపోయాడు.

అతనింతసేపూ మతానికి విరుద్ధంగానో, మతపెద్దలకు కోపం తెప్పించే విధంగానో కథో, డైలాగులో తను రాసి ఉంటాడని వూహించి భయపడ్డాడు. కానీ చివరికిలా తను రాసిన పదాలే పాములై తన మెడకు చుట్టుకుంటాయని, అవి కసిగా తన జీవితాన్నే కాటేస్తాయని తెల్సుకోలేకపోయాడు.

ఒక్కసారిగా అతనికి చుట్టూ చీకట్లు అలుముకున్నట్లనిపించింది. అంతా గాఢాంధకారం . . . చిక్కగా . . . ముద్దలా ఘనీభవించి . . . మృత్యువులా నోరు తెరుచుకుని . . . తనూ, జమీలున్నిసా ఒకరికోసం ఒకరు వెతుక్కుంటున్నారు. ఆమె తనని పిలుస్తోంది ఆర్తిగా.

తను ఆమెని పిలుస్తున్నాడు బాధగా. ఒకర్ని ఒకరు పిల్చుకుంటున్న శబ్దం పెద్దగా విన్పిస్తోంది. ఒకరికొకరు అతి సమీపంగా కదుల్తున్నట్లు భారంగా శ్వాస తీసుకుంటున్న ధ్వని . . . కానీ ఒకరికొకరు అనంతమైన దూరంలో . . .

జమీలున్నిసాకు కొన్ని నిముషాలు వాళ్ళేమంటున్నారో అర్థం కాలేదు. అర్థమయాక పిడుగు నెత్తిమీద పడ్డట్లు మ్రాన్పడిపోయింది. తలాక్ ఏమిటి? ఎవరు ఎవరికి తలాక్ ఇచ్చారు? అసలు వీళ్ళందరూ ఏం మాట్లాడ్తున్నారు? తన ఇబ్రహీం తనకు విడాకులివ్వటం ఏమిటి? అలా ఎన్నటికీ జరగదు. తనకు ఇబ్రహీం అంటే ప్రాణం. ఇబ్రహీంకి తనన్నా ప్రాణమే. అందరూ మతిభ్రమించినట్లు మాట్లాడ్తున్నారు.

తలాక్ అనే పదాన్ని మూడుసార్లు పలికి భార్యని వదిలించుకునే పద్ధతి సరియైంది కాదని – చాలామంది ముస్లిం యువకులు ఈ సాంప్రదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారనీ– అమాయకమైన ముస్లిం ఆడపిల్లలు దీనికి బలైపోతున్నారనీ – ఇబ్రహీం తనతో చాలాసార్లు చెప్పాడు. అందుకే కొంతమందికైనా కనువిప్పు కలగాలనే సదుద్దేశంతో తలాక్‌ని కథా వస్తువుగా తీసుకుని నాటకం రాశాడు. దీనివల్ల తలాక్‌ని తల్వార్‌లా వాడి స్త్రీల జీవితాల్ని నాశనం చేసి, వాళ్ళ మనసుల్ని ముక్కలుగా నరకటం తగ్గుతుందని తామిద్దరూ ఆశించారు. ఏ నాటకం వల్ల తోటి ముస్లింలకు ప్రయోజనం కలగాలని కోరుకున్నారో అదే నాటకం వల్ల తమ జీవితాలు చీకటిమయమౌతాయని ఆలోచించలేకపోయారు.

అంతటి విషాదంలోనూ తన బ్రతుకుని తల్చుకుని ఆమెకు నవ్వొచ్చింది. ఇబ్రహీంకి దగ్గరగా ఉండాలన్న కోరికతో నాటకాల్లో వేషాలు వేయడానికి ఒప్పుకుంది. అలా చేయడమే ఇప్పుడు తన కొంప ముంచింది. వీళ్ళందరూ ఇబ్రహీంని తనకుకాకుండా చేయడానికి బీడా ఎత్తుకుని వచ్చినట్లుంది. 'యా మాలిక్! నా షౌహర్‌ని నాకు దూరం చేయకు' అని వేడుకుంది.

అక్కడి మనుషులు రెండు వర్గాలుగా విడిపోయారు. షాబుద్దీన్ చెప్పినదాన్ని సమర్థించే వర్గం ఒకటి. అది నాటకంలో భాగం కాబట్టి తలాక్ కిందికి రాదని వాదించే వర్గం మరొకటి. నూటికి తొంభైమంది షాబుద్దీన్ పక్షం వహించారు. ఇబ్రహీంకి వత్తాసుగా నిలబడిన వాళ్ళలో ఎక్కువమంది నాటక సమాజం వాళ్ళే. అందులో ముసల్మానులు లేరు. “మా మతం గురించి మీకు తెలియదు. మీరిందులో దఖల్ కాకండి” షాబుద్దీన్ గుడ్లురిమి వాళ్ళ నోళ్ళు మూయించాడు.

“నిజమే. మాకు మీ మతం గురించి తెలియదు. కాని సాటి మనిషిగా ఇబ్రహీం గురించి బాగా తెలుసు. అతనికి తన భార్యకు విడాకులిచ్చే ఉద్దేశం లేనప్పుడు మీరు బలవంతంగా వాళ్ళని విడదీయటం అమానుషం” అంటూ వాళ్ళు నెత్తీనోరు బాదుకుని చెప్పినా ఎవ్వరూ

వినిపించుకోలేదు.

"మీరేమంటారు జనాబ్ ఖాజా మొహియుద్దీన్ సాబ్" అప్పటివరకూ జరుగుతున్న విషయాల్ని మౌనంగా పరిశీలిస్తున్న ఎం.పి. గార్ని అడిగారు. అతనప్పటికే ఓ నిర్ణయానికి వచ్చి ఉన్నాడు. తన పలుకుబడి పది కాలాలపాటు నిలబడాలంటే తను మెజారిటీ పక్షమే వహించాలి. మతానికి వ్యతిరేకంగా మాట్లాడి ముల్లాలకూ, ఖాజీలకు కోపం తెప్పించకూడదు. ప్రజల్ని మతం పేరుతోనే తన చుట్టూ తిప్పుకోవటం సాధ్యపడ్తుంది. తన అధికారం మతంతోనే ముడిపడి ఉంది. అతను లేచి నిలబడి, "మన షరీయత్‌ని తు.చ. తప్పకుండా పాటించడం ప్రతి ముస్లిం కర్తవ్యం. పొరపాటున ముట్టుకున్నా నిప్పు కాలుతుంది. తలాక్ అని మూడుసార్లన్నాక దానికి తిరుగులేదు. వాళ్ళిద్దరూ విడాకులు తీసుకున్నట్లే" అన్నాడు.

ఫరూక్ గారు అర్జెంట్ పనులున్నాయంటూ మెల్లగా జారుకున్నారు.

"తలాక్ వెంటవెంటనే చెప్పటం ధర్మసమ్మతం కాదు. ఓ వేళ విడిపోవాలన్న ఉద్దేశం ఉన్నా ఒకసారి తలాక్ చెప్పాక కొన్ని రోజులు ఆగాలి. అప్పటికీ భార్యలో ఆశించిన మార్పు రాకపోతే, లేక ఆమె తన తప్పుని సరిదిద్దుకోకపోతే అప్పుడు రెండో తలాక్ చెప్పాలి. మరలా కొన్ని రోజుల విరామం తర్వాత గత్యంతరం లేని పరిస్థితుల్లో మూడో తలాక్ చెప్పటం న్యాయం. కాబట్టి నేను వరుసగా మూడుసార్లు తలాక్ చెప్పటం చెల్లదు కదా" ఆశగా అడిగాడు ఇబ్రహీం.

"విరామం ఇచ్చి చెప్పాలని ఉంది. కానీ వరసగా చెప్పటం వల్ల చెల్లదని ఎక్కడా లేదు. మూడుసార్లు తలాక్ అనే పదం భర్త నోటి నుండి రావడమే ముఖ్యం" షాబుద్దీన్ గారు వివరణ ఇచ్చారు.

"సరే మీ నిర్ణయాన్ని నేను కాదనను. కానీ నాకు జమీలున్నిసా అంటే చాలా ఇష్టం. ప్రేమ. ఈ జన్మకి నాకు తనే భార్య. మనకున్నది ఒకే జన్మ. నాకు జమీలా దక్కే మార్గం సూచించండి. ఎంత కష్టమైనా సరే. నేను జమీలాను నాదానిగా చేసుకుంటాను" కన్నీళ్ళ పర్యంతమౌతూ వేడుకున్నాడు ఇబ్రహీం.

"దీనికి పరిష్కారం ఒక్కటే. జమీలున్నిసా మరొకర్ని నిఖా చేసుకుని, అతను విడాకులిస్తే, అప్పుడు భర్త వదిలేసిన ఆ స్త్రీని నువ్వు మరలా నిఖా చేసుకోవచ్చు."

"యా అల్లా! వినడానికే నాకింత కష్టంగా ఉంటే అలా జరిగితే నా జమీలా గుండె పగిలి చచ్చిపోవటం ఖాయం. తను లేకుండా నేను బతకలేను కాబట్టి నాకు ఆత్మహత్యే శరణ్యం. ఇద్దరి జనాజా లేస్తేగాని మీకు మనశ్శాంతి ఉండదనుకుంటాను".

"బర్‌ఖుర్దార్! మాకు నువ్వంటే దుష్మనీ ఏదీ లేదు. నేను నిమిత్తమాత్రుణ్ణి. షరీయత్ ప్రకారం

నడుచుకోవటం తప్ప మనకు మరో దారి లేదు".

"గుల్‌మొహర్‌లా ఉండే జమీలాని వేరెవరైనా నిఖా చేసుకుంటే తలాక్ ఇవ్వటం కల్ల. చూస్తూ చూస్తూ రుచికరమైన పలావ్‌ని మరొకరి థాలీలో వేస్తే, తినకుండా తిరిగి ఇచ్చేస్తాడా? పొరపాటున తలాక్ చెప్పి, పశ్చాత్తాపపడినా తలాక్ రద్దు కాదా? ఎంతగానో ప్రేమించే భార్యని మరొకరికి అప్పగించడానికి ఏ మగవాడికైనా మనసొప్పుతుందా?" ఇబ్రహీం వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

జమీలున్నిసాకి ఆలోచనల్తో పిచ్చెక్కేట్టుంది. తను మరో మగవాణ్ణి నిఖా చేసుకోవాలా? తోబా తోబా . . . తను మనిషి కాదా? తనకంటూ ఓ మనసుంటుందని వీళ్ళకు తెలియదా? తన ఇష్టాఇష్టాలతో అసలు ప్రమేయమే లేదా? తనేమైనా వస్తువా? ఒకడు వదిలేస్తాడట. మరొకడు నిఖా చేసుకుంటాడట. వాడు మరలా తలాక్ అంటాడట. అప్పుడు మొదటివాడు మరలా నిఖా చేసుకుంటాడట . . . అయ్యా! జనాబ్! బుజుర్గ్! మీ అందరికీ నా కన్నీటి సలాం. నాలో రక్తమాంసాలే కాదు స్పందించే మనసు కూడా ఉంది. నాకంటూ కొన్ని కలలూ, కోరికలే కాదు నిర్దిష్టమైన అభిప్రాయాలూ ఉన్నాయి. వాటికి పూచిక పుల్లకిచ్చినంత విలువ కూడా ఇవ్వరా?

నిజమే – ఇస్లాం స్త్రీ పైన పురుషుడికి ఒకింత ఆధిక్యతను ప్రసాదించింది. అంతేగాని బానిసలా చూడమనలేదు. బానిసలకే తమ అభిప్రాయాల్ని వెల్లడించే స్వాతంత్ర్యం ఉండదు. నా భర్త నాకు విడాకులు ఇవ్వలేదు. భార్యాభర్తల మధ్య సఖ్యతకు, సర్దుబాటుకు అవకాశం లేనపుడే విడాకులివ్వాలని మన మతం చెప్తోంది. మరి నా భర్తకూ, నాకూ మధ్య ఏ కలతలూ లేవు. కొట్లాటలు అసలే లేవు. మాది అన్యోన్య దాంపత్యం. మమ్మల్ని మా మానాన వదిలేయండి. ఇంకెప్పుడూ ముస్లిం జీవితాల గురించిన నాటకాలు వేయం. నేను హామీ ఇస్తున్నాను. మిమ్మల్ని సంస్కరించాలనుకున్న నా భర్త అమాయకుడు. అతన్ని క్షమించండి. నా నుంచి నా ప్రాణాన్ని వేరు చేయకండి.

ఆమె మనసు ఆక్రోశిస్తోంది.

అప్పటికే రాత్రి పదకొండు దాటింది.

"తుది నిర్ణయం రేపటికి వాయిదా వేయటం మంచిది. రేపు మనందరం మసీదులో మగరిబ్ నమాజ్ తర్వాత సమావేశమౌదాం. మత పెద్దలందరితో చర్చించి వారి రాయ్ తీసుకున్నాకే ఇబ్రహీం ఇచ్చిన తలాక్ గురించి నిర్ణయిద్దాం. ఏమంటారు?" అందరివైపూ చూసి షాబుద్దీన్ గారు అడిగారు.

అందరూ అంగీకారం తెల్పుతూ "ఆమేన్" అన్నారు.

"ఇబ్రహీం మియా! ఇప్పుడు మీరిద్దరూ భార్యాభర్తలు కారు. ఆ విషయంలో నాకెటువంటి అనుమానమూ లేదు. ఈ చర్చంతా కేవలం నీ సంతృప్తి కోసం. నువ్వూ, జమీలున్నిసా ఈ రోజు నుంచీ ఒకే ఇంట్లో ఉండకూడదు. నీకు మన మత నియమాలు తెలీనివి కాదు. భార్య కాని స్త్రీతో కలిస్తే వ్యభిచారం చేసినట్లే. ఆ నేరానికి మన షరీయత్ ప్రకారం శిక్ష ఎంత కఠినంగా ఉంటుందో నీకు చెప్పక్కరలేదనుకుంటాను. హెచ్చరించటం నా ధర్మం కాబట్టి చెప్పాను. జత్తన్ రహనా. సమఝేనా?" షాబుద్దీన్ గారు అందరూ వినేట్టు పెద్దగా చెప్పారు.

తెల్సినవారింట్లో జమీలున్నిసా ఆ రాత్రి గడపాలని నిర్ణయించబడింది.

ఎవరెంత బ్రతిమాలినా ఆమె మెతుకు ముట్టలేదు. పిన్ని వరసయ్యే వాళ్ళింట్లో ఓ మూలన చాప పర్చుకుని పడుకుంది. నిద్ర పట్టటం లేదు. ఎంతటి ఘోరం! తను మనుషులుండే సమాజంలోనే ఉందా లేక ఇదేమైనా మృగాలు సంచరించే అడవా? ఇబ్రహీం తనను తాకితే వ్యభిచార నేరం చేసినట్లా? విడ్డూరం కదూ! భార్యని భర్త తాకకూడదు. భార్యాభర్తలిద్దరూ ఒకే ఇంట్లో ఉండకూడదు. తనని మరో మగాడు నిఖా చేసుకుని కాపురం చేశాక వదిలేస్తే మరలా ఇబ్రహీం నిఖా చేసుకుని తనను తాకితే తప్పులేదు. 'అల్లా ! నా జీవితాన్ని అంధకారం చేయకు. నేనే పాపమూ చేయలేదు. నాకీ శిక్ష విధించకు.' పదే పదే అల్లాని వేడుకుంటూ, జాగారం చేసింది.

ఇబ్రహీంకి బాధతో గుండె చెరువైంది. నిద్ర రావటం లేదు. జమీలా జ్ఞాపకాలు దొంతర్లుగా వస్తున్నాయి. గదంతా చిక్కని చీకటి . . . నల్లటి బాకులా మెదళ్ళో గుచ్చుకుంటున్న చీకటి . . . తన జీవితంలో నిన్నటివరకు పండువెన్నెల . . . నేడు కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి . . . కసాయి చీకటి . . . తన జమీలాని అమాంతం కొండ చిలువలా మింగేసిన చీకటి . . .

తలాక్ అనే మూడక్షరాల పదం అణుబాంబులా పేలి తన జీవితాన్ని భస్మీపటలం చేస్తుందని తనెన్నడూ వూహించలేదు. ముస్లిం యువకులు ఈ మధ్య టెలిగ్రాముల ద్వారా, టెలిఫోన్ల ద్వారా, ఈమెయిల్స్ ద్వారా తలాక్ తెలిపి భార్యల్ని వదిలించుకుంటున్నారని విని తనెంత అశాంతికి గురైనాడూ! మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు తీసుకునే ఈ సాంప్రదాయం అమానుషమని పదిమందికి చాటాలని కలలు కన్నాడు. కానీ ఇప్పుడు తనే అన్యాయంగా బలైపోతున్నాడు.

అతని చుట్టూ వ్యూపాలా అల్లుకుని అన్యాయం లాంటి చీకటి . . .

వందల, వేల ఆలోచనలు చెదపురుగుల్లా మెదణ్ణి తినేస్తున్నాయి. నిమిషాలు యుగాల్లా భారంగా కదుల్తున్నాయి. జమీలా తన పక్కన లేని ఆ రాత్రి కాళరాత్రిలా భయపెడుతోంది. ఏవేవో అస్పష్టమైన రూపాలు వికృతంగా తన వైపుకు దూసుకువస్తున్నాయి. చీకటి తనని కబళించటానికి పొంచి ఉన్న చిరుతపులిలా ఉంది.

తొందరగా తెల్లారితే ముల్లాల, ఖాజీల గడ్డాలూ, కాళ్ళూ పట్టుకునైనా తన జమీలాని దక్కించుకోవాలని అతని ఆరాటం.

ఎన్ని గంటలు ఎదురుచూసినా కళ్ళలోకి తారులా జారుతున్న చీకటి తప్ప సంధ్యారుణ కాంతుల ఛాయలే లేవు.

అతనికాక్షణం భయమేసింది.

అసలెప్పటికైనా తెల్లారుతుందా?

తప్పకుండా తెల్లారుతుందన్న నమ్మకం కలిగితే ఎన్ని యుగాలు ఎదురు చూడటానికైనా అతను సంసిద్ధంగా ఉన్నాడు.

జమీలాకు తెల్లారేవరకూ ఆగాలనిపించలేదు. ఇబ్రహీం తన భర్త - అది అల్లా నిర్ణయం. దాన్ని మార్చే అధికారం ఈ ముల్లాలకు, ఇమాంలకు ఎవరిచ్చారు? షరీయత్‌ను వాళ్ళ ఇష్టానుసారం వక్రీకరించి తన జీవితంతో ఆడుకుంటుంటే తను చేతులు ముడ్చుకుని కూచోలేదు. తను విధేయత చూపాల్సింది అల్లాకే - మానవత్వం మరిచిన మనుషులకు కాదు.

ఆమె లేచి వడివడిగా తయారైంది. తనిప్పుడు ఎవర్నీ లెక్క చేయదు. తన ఇబ్రహీంని తననుంచి ఎవ్వరూ వేరు చేయలేరు. తామిద్దరూ ఏకం కావటం కోసం అవసరమైతే లోకమంతా ఏకమైనా ఎదిరిస్తుంది.

ఆమె అడుగు బైటికి పెట్టింది. ఇబ్రహీం ఉన్న ఇంటిని సమీపిస్తున్నప్పుడు అరుణారుణ సంధ్య ఆమెకెదురొచ్చి స్వాగతం పలికింది.

*(ఆంధ్రప్రభ ఆదిత్య హృదయం - ఆదివారం 2 నవంబర్, 2003;*

*ఆటా - వార్త 2002 కథల పోటీలో ఎన్నికైన కథ)*